



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 900 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

## చలం జీవితం – సాహిత్యం

### -8-

*"మంచి సాహిత్యం రెండు రకాలు. ఒకటి: అందమైన పటమల్లే గోడకు వేల్లాడుతూ, మనసును ఆనందంతో నింపేది. రెండు: ఉరిమీ, చెండాడీ.. మంచికో చెడ్డకో జీవితాన్ని ప్రభావితం చేసేది. మొదటి రకం సాహిత్యం ఇప్పుడు [అంటే ఎనభై ఏళ్ళ క్రితం] బళ్ళకొద్దీ తయారవుతోంది. రెండోది బహుస్వల్పం. ఈ రెండో రకపు సాహిత్యాన్ని దేశానికీ ఇచ్చే వాళ్ళలో నేనూ ఒకడిని. కానీ, నాకే ఉండాల్సినంత ఫోర్స్ లేదేమోనని అనిపిస్తోంది. నేను, నా కథల్లో, నాటకాల్లో సంఘనీతిని ఎటాక్ చేస్తున్నాను. నన్ను ఎరిగిన వాళ్ళందరికీ నా జీవితమే ఒక విప్లవ ఉద్యమమని తెలుసు. పైగా నా ప్రవర్తనకీ, నా భావాలకీ సాహిత్యం తోడ్పడింది. వాళ్ళు ఏడ్చిన కొద్దీ నేను విప్లవకరమైన సాహిత్యాన్ని సృజించాను. నిజానికి అందరూ అనుకున్నట్లుగా నేను చెప్పేదాంట్లో అంత విప్లవకరమైన దేమీ లేదు. వాళ్ళ పాత నీతుల్నే, కొత్త లైట్లో చూసాను."*

ఇవన్నీ కూడా చలంగారు తన రచనల గురించి, తను వ్యక్తం చేసుకున్న భావాలు. భావాలైనా, అనుభావాలైనా దేనికీ దాపరికం లేదంటూ వ్రాసిన రచనల్లోనూ, జీవించిన జీవితం లోనూ

నిజాయితీకి పెద్ద పీటవేసిన ధైర్యం వున్న రచయిత. తనను ఎవరు ఎన్ని అవమానాలకు గురి చేసినా, ఎన్ని ఛీత్కారాలకు బలి చేసినా మొత్తం సమాజాన్ని ఎదిరించడానికి సిద్దపడిన దమ్మున్న రచయిత చలం, గుడిపాటి వెంకట చలం.

చలంగారు హొస్పేటలో వుద్యోగం చేసేటప్పుడు వదినగారిని మద్రాస్ లో చేర్పించారు కదా! ఆ సమయంలో రత్నమ్మ ఒక వైపు చలంగారి తోటి, మరోవైపు రాం మూర్తి తోటీ తన సంబంధాన్ని కొనసాగించింది. బహుశా, ఈ అనుభవాలే తరువాత రోజుల్లో చలంగారి 'మైదానం' నవలకు స్ఫూర్తి ని ఇచ్చాయని విశ్లేషకులు అంటారు. మొత్తం వీళ్ళ మధ్య జరిగినటువంటి వ్యవహారం, మైదానం నవలలోని పాత్రలను పోల్చి చూస్తే... రత్నమ్మా, రాంమూర్తీ, చలం... రాజేశ్వరీ, అమీర్, మీరా అని కూడా కొంత మంది భావిస్తుంటారు

ఇంకా ఆయన హొస్పేటలో వుద్యోగం చేసేటప్పుడు జరిగిన ముఖ్యమైన సంఘటనల్లో చెప్పుకోవలసింది – ఆయన రెండవ సంతానం "సౌరిస్" జననం. ఆమెనే అతని ఆత్మకథలో "షౌ" అని రాసుకున్నారు. చలం గారికి జీవితాంతం, ఆయన చనిపోయేటంత వరకూ కూడా అత్యంత సన్నిహితంగా వున్నది ఈ పెద్ద కుమార్తె సౌరిస్సే. ఈ సౌరిస్ గారే, చలం గారు చనిపోయాక, భీమిలిలో ఆశ్రమాన్ని ప్రారంభించి, ఆమె జీవితాంతం అక్కడే వున్నారు. మరొక విశేషం ఏమిటంటే, చలంగారు హొస్పేట లో పనిచేసే చివరి రోజుల్లో 'శశిరేఖ' నవలను రాశారు. ఈ శశిరేఖ నవలోని కథాంశంలో కూడా కొంచెం ఈ రత్నమ్మగారి నుండి తీసుకున్నట్లుగా అనిపిస్తుంది. తనకు ఇష్టంలేని పెళ్లి నుండి తప్పించుకున్న కధానాయిక, ఆ తరువాత ఇద్దరు ముగ్గురు మగవాళ్ళతో కలసి జీవించడం ఈ నవలలోని ప్రధాన ఇతివృత్తం. ఈ నవలను చలం గారు తన మిత్రుడు రాంమూర్తికి అంకితం ఇచ్చారు. ఇవి 1920, 22 ప్రాంతాల్లో అంటే, చలం గారికి 26, 28 వయసులో జరిగిన కొన్ని సంఘటనలు. ఇక్కడ నుండి మరో పదేళ్ళు అంటే 1930 వరకూ చలం గారి జీవితంలో అంటే, వృత్తి జీవితంలోనూ, వ్యక్తిగత జీవితం లోనూ, మిత్రుల జీవితం లోనూ, సాహిత్య జీవితం లోనూ చాలా సంఘటనలు జరిగాయి.

హొస్పేటలో వుద్యోగం అయిపోయింది. వాళ్ళతో పోట్లాడి అక్కడ మానేశారు. మరి ఆయనతో పాటుగా రాం మూర్తీ, ప్రకాశంలు కూడా ఉద్యోగాలు వదిలెయ్యాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఆ రోజుల్లో వుద్యోగం పోతే, మళ్ళీ తెచ్చుకోవాలంటే మద్రాస్ రాష్ట్ర రాజధాని మద్రాస్ నగరం చేరుకోవల్సిందే. రాంమూర్తీ, రత్నమ్మా, చలం మద్రాస్ వెళ్లారు. అక్కడ ఉండేటప్పుడు తినడానికి కూడా డబ్బులు ఉండేవి కావు. అందుకు ఏదో సత్రం లో ఉంటూ, బుట్ట భోజనం తెప్పించుకొని, దాన్నే రోజంతా తినేవారు.

ఎలాగో వాళ్ళ ప్రయత్నాలు ఫలించి, చలం గారికి రాజమండ్రి ట్రైనింగ్ స్కూల్లో, ఆయన ఎక్కడైతే ట్రైనింగ్ తీసుకున్నారో అక్కడే వుద్యోగం వచ్చింది. రాంమూర్తికి కూడా రాజమండ్రిలోనే జైలు లో క్లర్క్ వుద్యోగం వచ్చింది. వాళ్ళ మూడో మిత్రుడు ప్రకాశానికి కూడా అక్కడే వుద్యోగం వచ్చింది. ఆ విధంగా ముగ్గురూ రాజమండ్రి వచ్చేశారు. ముందు చలం గారి సంగతి చూద్దాం.

చలంగారికి ఇప్పుడు ఇద్దరు పిల్లలు. రవి 6, 7 సంవత్సరాలు. సౌరీస్ ఇంకా చిన్నపిల్ల. అంతకు ముందే ఆయనకు రాజమండ్రితో అనుబంధం వుంది. రాజమండ్రిలో ఎవరూ ఇల్లు అద్దెకు ఇవ్వలేదు. దాదాపు వూరి బయట ఒక మహ్మదీయుల ఇంట్లో ఒక పోర్షను అద్దెకు తీసుకున్నారు. పనిమనుషులు వచ్చేవారు కాదు. ఈ లోగా భార్య రంగనాయకమ్మగారు మూడవసారి గర్భవతి అయ్యారు. “ఆ గర్భాన్ని మోస్తూ, గోదావరి దగ్గరకు వెళ్లి మంచి నీళ్ళు తెస్తూ వంటచేస్తుండేవారు.” అని రాసుకున్నారు. భార్యాభర్తల మధ్య ఎప్పుడూ ఏదో పోట్లాటలు ఉండేవి. ఎందుకంటే, భార్యకి, చలంగారి ప్రవర్తన నచ్చేది కాదు. ఏ పోట్లాటలూ లేనపుడు, ఇద్దరూ కలసి వంట చేసుకోవడం, అంట్లు తోముకోవడం చేస్తుండేవారు. గానీ, ఎప్పుడూ అశాంతి గానే వుండేవారు. పోనీ, చలం గారిని వదిలేసి వెళదాం అంటే, ఎక్కడకి వెళతారు?వెళ్తే, తెనాలి వెళ్ళాలి. లేదంటే, ఇక్కడే వుండాలి. అందుకని రాజమండ్రిలోనే వున్నారు. చలం గారు ఆ ట్రైనింగ్ స్కూలుకి వెళుతున్నారు.

మరో మిత్రుడు ప్రకాశం. అతని భార్య సత్యవతి. అతనకి కూడా చలం మిత్రుడు అని తెలిసి, ఇల్లు అద్దెకి ఇవ్వలేదు. దాంతో, వూరికి దూరంగా అరణ్యం లాంటి ప్రదేశంలో ఒక పాడుపడిన ఇల్లు వుంటే, దాన్ని బాగుచేసుకొని అక్కడ ఉండేవాడు. అంటే, సమాజానికి వ్యతిరేకంగా ఏ చిన్న పని చేసినా అంత క్రూరమైన శిక్ష వుండేది.

మరి అసలు మిత్రుడు రాంమూర్తీ, రత్నమ్మ ఎక్కడున్నారు? ఎలా ఉన్నారు? రాం మూర్తి జైలు లో పనిచేస్తున్నాడు కాబట్టి, వీళ్ళకి మాత్రం కాస్త సౌకర్య వంతంగా జైలు క్వార్టర్స్ లో ఇల్లు దొరికింది. ఆ రాం మూర్తి భార్యా పిల్లలూ రాజమండ్రిలో కొంత కాలం వున్నారు గానీ, వాళ్లకు రాంమూర్తీ, రత్నమ్మల సంబంధం నచ్చక వెళ్ళిపోయారు. ఇక్కడ కూడా రత్నమ్మ, చలం గారితోటీ, రాం మూర్తీలతో సంబంధాన్ని కొనసాగిస్తున్నది. ఆ త్రికోణ ప్రణయం అలాగే సాగుతోంది. కాకినాడ నుండి దేవులపల్లి క్రిష్ణ శాస్త్రి గారు అప్పుడప్పుడు వచ్చి కలుస్తుండేవారు.

చలం గారు, వదిన గారిని మద్రాస్ లో చేర్పించారు కదా! అక్కడ నుండి ఆమెను, హైదరాబాద్ లో L.M.P.[లైసెన్సడ్ మెడికల్ ప్రాక్టినర్] అనే డిగ్రీలో చేర్పించారు. అక్కడ ఏదో స్కాలర్

షిప్ వస్తుంటే, దాంతో ఆమె చదువు కొనసాగుతోంది. ఇక్కడ రాజమండ్రిలో చలం గారు ఎలా వున్నారంటే.. సాయంత్రం అయితే, జైలు క్వార్టర్స్ వుండే రాంమూర్తి ఇంటికి వెళుతుండేవారు. అప్పుడప్పుడు దేవులపల్లి కూడా వచ్చేవారు. సాహిత్య చర్చలు జరుగుతుండేవి. చాలా మంది యేమకునునే వారంటే.. దేవులపల్లిగారు రాం మూర్తిని కలవడం కంటే, రత్నమ్మ ను చూడ్డానికే వెళుతున్నారని అందరూ అనుకునేవారు.

భార్య రంగనాయకమ్మ గారికి చలం గారి విచ్చలవిడి తనం నచ్చేది కాదు. అందుకని ఎవరినీ ఇంటికి రానిచ్చేది కాదు. వచ్చినా గానీ, వరండాలోనే భోజనం పెట్టి, పంపించేస్తూ వుండేది. చలం గారికోసం రత్నమ్మే కాకుండా వేరే మహిళలు కూడా వస్తుండేవారు. మరి ఆయన వాళ్ళని ఎక్కడ ఉంచుతారు? అందుకని ఒక గెస్ట్ హౌస్ లాంటిది తీసుకున్నారు. గెస్ట్ హౌస్ అంటే, పెద్ద బిల్డింగ్ లాంటిది ఏమీ కాదు. ఎందుకంటే, వాళ్లకి ఇల్లే అద్దెకు ఇవ్వరు. మరి గెస్ట్ హౌస్ ఎవరు ఇస్తారు? ఆయన గెస్ట్ హౌస్ ఏమిటంటే? ఆయన ఇంటికి దగ్గర్లోనే ఒకప్పుడు పందులు వుండేటటు వంటి పాక వుండేది. చిన్నది. 4,5, అడుగులు వుంటుంది. దాన్ని ఆయన "పచ్చ పాము పాక"అని రాసుకున్నారు. ఆ కప్పు మీద ఒక పచ్చ పాము తిరుగుతూ ఉండేదట. అందులో పందులు ఉండేవి. ఆ పాకని రెండు రూపాయలకు అద్దెకు తీసుకున్నారు. ఆయన కోసం వచ్చే మహిళలని అక్కడకు తీసుకువెళుతుండేవారు. ఇవన్నీ భార్యకు తెలుసు. తెలిసినా, ఇంక ఆమె ఏమీ మాట్లాడలేక, ఆయన త్రోవ ఆయనది అని వదిలేసారు. అప్పటికి చలం గారికి మరో కుమారుడు జన్మించాడు. అతని పేరు "వసంత్". ఇప్పుడు ముగ్గురు పిల్లలు.

ఈ వసంత్ పుట్టినపుడు కూడా భార్య రంగనాయకమ్మగారికి ఆరోగ్యం బాగాలేకపోతే, తెనాలి వెళ్లారు. ఆ సమయంలో కూడా తన అలవాట్లని గానీ, తన దగ్గరకు వచ్చే స్నేహితురాళ్ళని గానీ, ఏదీ వదులుకోలేదు. ఇలా రాజమండ్రి జీవితం కొనసాగుతోంది. ఆయన వుండే ఇల్లు గోదావరికి దగ్గరలో వుండేది. ఒక చిన్న పడవ కూడా వుండేది. ఆ పడవతీసుకొని, పిల్లాడిని అందులో ఎక్కించుకొని, గోదావరి మీద షికారుకి వెళ్ళడం, అలాగే సాయంకాలం పూట మిత్రులతోటీ, స్నేహితురాళ్ళ తోటి కలసి, గోదావరి అవతలకు వెళ్లి అక్కడ రాత్రంతా వుండి మర్నాడు రావడం.. ఇలా ఆయన జీవితం కొనసాగుతోంది.

మరి ఆయన చదువుకునే రోజుల్లో, ఇదే రాజమండ్రిలో, వాళ్ళ మేనత్తగారి పూరి పాకలో వుండేవారు అనుకున్నాం కదా! ఆ మేనత్త గారు, చలం గారు మళ్ళీ రాజమండ్రి వచ్చారని తెలిసి, ఇంటికి రావడం ప్రారంభించారు. ఆమె అప్పటికీ చాలా బీదరికంలో వుంది. యెంత బీదరికం అంటే,

తినడానికి తిండి కూడా వుండేది కాదు. చలం గారి ఇంటికి వచ్చినపుడు, ఎండలో నడచుకుంటూ వచ్చేది. అలా వచ్చినపుడు  చెప్పులు లేక, కాళ్ళకి గుడ్డ పీలికలు చుట్టుకొనేది. "తినడానికి తిండి కూడా వుండడం లేదు" అని ఏడుస్తూ వుండేది. ఒకప్పుడు ఎంతో వైభవోపేతంగా జీవించిన మనిషి. ఆ చుట్టుపక్కల వాళ్ళు అనేవారట "ఆ గుడ్డ పీలికల రాణి ఎవరు?" అని. అంత దయనీయంగా వుంటుండేదట.

అయితే..చలం గారు, ఆమెకి ఒక వాగ్దానం చేసారు కదా "నాకు వుద్యోగం వచ్చిన తరవాత నిన్ను బాగా చూసుకుంటాను" అని. ఆనాటి మాటను అనుసరించి  హైదరాబాద్ లో చదువుకుంటున్న వదిన గారికి చెప్పారు."ఇలా అబ్బత్త కు ఏమైనా చెయ్యాలి" అని. ఆమె తను ఉంటున్న దగ్గరే ఒక ట్రైనీ నర్సుగా వుద్యోగం ఇప్పించారు అబ్బత్త కు. అక్కడ వున్నప్పుడు కూడా ఈ అబ్బత్త అందాన్ని చూసి, అక్కడ డాక్టర్లూ, ఇతరులూ ఆమె చుట్టూ తిరుగుతూ వుండేవారట. ఆమెకు వుద్యోగం ఇప్పించిన వ్యక్తి "సరోజినీ నాయుడు గారి" భర్త. "మేజర్ నాయుడు". అతను అక్కడ డాక్టర్.

ఆమె పనిచేస్తున్న హాస్పిటల్ కి ఏదో పని ఉందనే మిష మీద ఆమెను చూడ్డానికి ఆ డాక్టర్ గారు వారానికి రెండు, మూడు సార్లు వస్తుండేవాడట. ఈమె ట్రైనీ నర్సు అయినప్పటికీ ఈమె వస్తేనే గానీ, ఆపరేషన్లు మొదలు పెట్టేవారు కాదట. అందరూ తనచుట్టూ తిరగడంతో ఇబ్బంది అనిపించి, ఆమె మద్రాస్ వెళ్ళిపోయారు రఘుపతి వెంకట రత్నం నాయుడు గారి దగ్గరకు. అతను అక్కడ వైస్ ఛాన్సలర్ గా పనిచేస్తున్నాడు. అతనితో జరిగిన విషయం అంతా చెప్పారు. అంతా విని"ఫరవాలేదమ్మా! నువ్విక్కడే వుండు. నేను ఒక పని చేస్తాను" అని, ఆమె ట్రైనింగు అయిపోయినట్లుగా సర్టిఫికేట్ తెప్పించి, ఒక హస్పిటల్లో నర్సు వుద్యోగం ఇప్పించారు. ఆ విధంగా చలం గారి మేనత్త గారి జీవితం అక్కడ స్థిర పడింది. తర్వాత చలం గారి స్వీయచరిత్ర లో అబ్బత్త గారి ప్రస్తావన ఎక్కడా కనిపించలేదు. అలా ఆమె నుండి సహాయం పొందిన చలంగారు ఆమె జీవితాన్ని ఒక తీరుకి తీసుకువచ్చారు.

ఇక వదిన రంగనాయకమ్మ గారు – హైదరాబాద్ లో చదువుకునేటప్పుడు, సెలవులకు రాజమండ్రి వస్తుండేవారు. వచ్చినపుడు ఆ "పచ్చ పాము పాక"లో చలం గారూ, వదిన రంగనాయకమ్మ గారూ వుండడం, భార్య రంగనాయకమ్మ గారికి తెలుస్తూనే ఉండేవి.చలంగారికి ఏవైనా డబ్బులు వస్తూవుంటే, హైదరాబాద్ వెళుతుండేవారు. హైదరాబాద్ వెళ్లినపుడల్లా, "అయ్యో! పిల్లల్ని వదిలేసి వచ్చానే"అని బాధ పడేవారు. చిన్నప్పటినుండి పిల్లలంటే, విపరీతమైన ప్రేమ. తల్లి దగ్గర కంటే, తండ్రి దగ్గరే ఎక్కువ వుండేవారు. తనకి ఎన్ని పనులున్నా పిల్లలకోసం ఎక్కువ సమయం కేటాయించేవారు. ఇదీ చలం గారు రాజమండ్రిలో కొనసాగినటువంటి పరిస్థితి.

ఇక రచయితగా కూడా రాజమండ్రిలో ఉండగానే ఎదిగారు. ఆ రోజుల్లోనే ఆయన స్కూల్లోనే పనిచేస్తున్న "చింతా దీక్షితులు"అనే వ్యక్తి పరిచయం అయ్యారు. ఈ చింతా దీక్షితులు కూడా "డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్"లోనే పనిచేస్తుండేవారు. ఆయన చలంగారికంటే ఏడు సంవత్సరాలు చిన్నవాడు. ఇతని పరిచయం చలంగారికి జీవితాంతం కొనసాగింది. అంతేకాదు, చలంగారి జీవితంలో అతి ముఖ్యమైన మలుపులకి ఈ చింతా దీక్షితులే కారణం. ఆయన కూడా రచయితగా అప్పుడప్పుడే ఎదుగుతున్నారు. కథలూ, నాటకాలూ రాస్తున్నారు. ఆయనకు చలం గారు పరిచయం అయ్యాక, ఈయన ఏదో రాస్తారని తెలిసి, చలం గారు రాసిన "శశిరేఖ"నవల చదివి, ఇంకా రాయమని ప్రోత్సహించారు. ప్రోత్సహించడమే కాకుండా, చలం గారి మొట్ట మొదటి కథని ఈ చింతా దీక్షితులు గారే పత్రిక్కి పంపించారు. ఆ కథ ప్రచురణ జరిగాక, రెండో కథని రాయమనడం.. ఇలా చలంగారి వెనుక ఆయన ప్రోత్సాహం ఎంతో వుంది. అప్పటి పరిస్థితిని గుర్తు చేసుకుంటూ చలంగారు ..."మొదటి కథ రాయగానే నా వైపు చాలామంది చూశారు. ఎవరో ఇతను కొత్తగా రాస్తున్నాడు.అని నాతో పరిచయం చేసుకుందాం అనుకున్నారు. రెండో కథ రాయగానే భయపడి పారిపోయారు. మూడవ కథ రాయగానే నా మీద దండెత్తడం ప్రారంభించారు"అని రాసుకున్నారు.

అయితే, చింతా దీక్షితులు గారు మాత్రం, ప్రపంచం ఏమనుకున్నా, చలంగారికి తోడుగా వుండి, ఆయనకు ప్రతి దశలోనూ, "ఆయన్ని ఎలా రక్షించాలా?ఆయన ఇబ్బంది పడితే ఏం చేయాలా?" అని తగిన సహాయాన్ని అందిస్తుండేవారు. మొత్తంగా చలం గారి జీవితాన్ని చూసుకుంటే, జీవితాంతం ఆయన్ని వెన్నంటి వుండిన వాళ్ళు ముగ్గురు. 1.పెద్ద కూతురు సౌరిస్.2, చింతా దీక్షితులు 3. వదిన రంగనాయకమ్మ గారు.

రాజమండ్రిలో రెండు సంవత్సరాలు వున్నారు. ఆ రెండు సంవత్సరాలూ రుక్మిణీ, సుశీల వంటి కథలూ, దైవమిచ్చిన భార్య – అనే నవల రాశారు. తరువాత 1924లో ప్రమోషన్ మీద బందరు బదిలీ అయ్యింది. బందరు తర్వాత అనంతపురంలో ఒక సంవత్సరం, ఏలూరులో ఒక సంవత్సరం, గుంటూరులో రెండు సంవత్సరాలూ, నర్సారావుపేట లోనూ ఇలా 193o వరకూ జరిగింది. ఆయన ఎక్కడ వున్నా భార్య సౌకర్యంగా వుంటే, ఆతనితో వుండేవారు. లేకపోతే పిల్లల్ని అక్కడే వదిలేసి, తెనాలి అత్త వారింటికి వెళ్ళిపోయేవారు. ఆ విధంగా పిల్లలతో ఎక్కువ సాన్నిహిత్యం ఏర్పడింది.

బందరులో వున్నప్పుడు, కోకాబలరాం అని ఒకతను వుండేవారు. అతని ఇంట్లోనే అద్దెకి వుండేవారు. ఆయన పెద్ద డాక్టర్. సుమారు అదే రోజుల్లో చలం గారి జీవితంలో ఒక పెద్ద విషాదం

ప్రారంభమయ్యింది. అదేమిటంటే, వాళ్ళ పెద్దబ్బాయి 'రవి'కి గుండెకు సంబంధించిన వ్యాధి ఏదో వుందని తెలిసింది. ఈయన బందరులో ఉండగానే "బిడ్డల శిక్షణ"అనే పుస్తకం రాశారు. అలాగే నోబుల్ కాలేజీలో ఏదో సభ జరిగినపుడు " మేన్&వుమెన్" అనే విషయం మీద ఉపన్యాసం ఇచ్చారు. దాన్నే విస్తరించి ఆ తరువాత మరో 6 సంవత్సరాలకి "స్త్రీ"అనే పుస్తకం రాశారు. చలంగారు రాసిన అన్నిటిలోనూ అత్యధిక సార్లు పునర్ముద్రణ పొందిన పుస్తకం ఈ "స్త్రీ". 193o నుండి ఈనాటి వరకూ ముద్రణలు పొందుతూనే వుంది.

ఆయన యెంత బోల్డ్ గా వున్నా మిత్ర బృందం తో తప్పితే, ఎక్కువగా బయటకు వెళ్ళే వారు కాదు. ఎవరైనా మాట్లాడినా, ఏ మాత్రం మోహ మాటం లేకుండా సమాధానం చెబుతుండేవారు. ఆయన బందరులో వుద్యోగం చేసేటప్పుడు, కృష్ణాపత్రిక సంపాదకులు ముట్నూరు క్రిష్ణారావుగారు ఒకే ఒక్కసారి చలం గారితో మాట్లాడారు. గతంలో ఆయన పత్రికలో చలంగారు బ్రహ్మ సమాజం గురించి వ్యాసాలు రాశారు. చలంగారు బందరులో పని చేస్తున్నారని తెలిసి, ఎక్కడో కనబడితే " ఏమయ్యా! చలం! నువ్వు తీవ్రమైనటు వంటి కథలు రాస్తున్నావు. అంటే ఆడవాళ్ళు వెళ్ళిపోయేటట్లు...అంటే, నీ ఉద్దేశ్యంలో ఏ భార్య కైనా భర్త నచ్చకపోతే, దిండు కింద ఒక చీటీ పెట్టి, వెళ్ళిపోవడమేనా? ఇదేనా నువ్వు చెప్పేది" అని అడిగారట.

దానికి చలం గారు " పొరపాటు సార్!నేను అలా చెప్పలేదు.దిండు కింద చీటీ పెట్టకుండా కూడా వెళ్లిపోవచ్చు. అని చెప్పాను" అని సమాధానం చెప్పారు.అదే ముట్నూరు క్రిష్ణారావు గారితో జరిగిన మొదటి, చివరి సంభాషణ.

బందరు నుండి ఇతర బదిలీల తర్వాత విజయవాడ వచ్చిన 5,6 సంవత్సరాలలో ఆయన జీవితంలో రెండు విషాదకరమైన సంఘటనలు జరిగాయి. మొదటిది రాంమూర్తి ఆత్మహత్య. రెండవది పెద్ద కుమారుడు రవి మరణం. ముందు రాంమూర్తి విషయం.

చలంగారు ప్రమోషన్ మీద బందరు వెళ్ళిన తరువాత కాలంలో రాం మూర్తీ, రత్నమ్మలు భార్యాభర్తలు కారనీ, సహజీవనం చేస్తున్నారనీ ఆ చుట్టుపక్కల వాళ్లకు తెలిసిపోయి, భరించలేకపోయారు. ఎలాగంటే...బయటకు వెళ్తే, సూటీ పోటీ మాటలు అనడం. రాళ్ళు తీసుకొని కొట్టడం ఇలాంటి పనులు చేసేవారు. దాంతోటి వాళ్ళు రాజమండ్రిలో ఉండలేక కడప జిల్లాలో ఏదో చిన్న ఊరు "కమలాపురం"అనే వూరు వెళ్లారు. అక్కడ కూడా వాళ్ళ పరిస్థితి సరిగ్గా లేక, మద్రాస్ వెళ్ళిపోయారు. ఇటు చలంగారు ట్రాన్స్ ఫర్లతో వూర్లు తిరుగుతున్నారు.

వాళ్ళు మద్రాస్ వెళ్ళడానికి కారణం ఏమిటంటే... రాంమూర్తికి ఒక చిన్నప్పటి మిత్రుడుండేవాడు. అతని పేరు పిల్లుట్ల హనుమంతరావు. ఆయన మద్రాస్ లో అడ్వకేట్ గా ఉంటున్నాడు. ఆయన సహాయంతో మద్రాస్ లోని "తంబు చెట్ల స్ట్రీట్"లో ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నారు. అంత వరకూ బాగానేవుంది. రాంమూర్తి మద్రాస్ లో ఏదో వుద్యోగం చూసుకున్నాడు.పెద్దగా ఇబ్బంది లేకుండా కాలం గడుస్తూనే వుంది.

అలా వుండగా, ఈ పిల్లుట్ల హనుమంతరావు కి ఒక మిత్రుడు వున్నాడు. అతని పేరు జయంతి సుబ్రహ్మణ్యం. అతను అక్కడే మెడిసన్ చదువుతున్నాడు. వీళ్ళది కూడా కాకినాడే. అతని తండ్రి పేరు జయంతి గంగన్న. బాగా పేరున్న వాళ్ళు. అప్పటివరకూ బావ రాం మూర్తి తో ఉంటున్న రత్నమ్మ. ఆ జయంతి సుబ్రహ్మణ్యాన్ని ప్రేమించింది రత్నమ్మ. ఈ ప్రేమ ఎంతవరకూ వెళ్లిందంటే, పెళ్లి వరకూ వెళ్ళింది. అది రాం మూర్తికి నచ్చలేదు. ఎందుకు నచ్చలేదు? మిత్రుడు గా వున్ననంత వరకూ ఫరవాలేదు. చాలామంది మిత్రులు వుండేవారు. కానీ, ఈ వివాహం జరగబోతోంది అని తెలిసి విపరీతంగా వేదనకు లోనయ్యారు. రాంమూర్తి ఆ సమయంలో చలం గారికి వుత్తరం రాశాడు."నేను కాకినాడ నుండి మద్రాస్ వెళుతున్నాను.ఒకసారి నువ్వు రైల్వే స్టేషన్ కి రా! నిన్ను చూడాలనివుంది"అని. బహుశా ఆ కాలంలో చలంగారు ఏలూరు లో వున్నారనుకుంటాను. చలంగారుపిల్లలను కూడా తీసుకొని స్టేషన్ కి వెళ్లారు. బండి ఆగినపుడు రాం మూర్తి దిగి, పిల్లల చేతిలో కమల ఫలాలు పెట్టాడు. చలంగారితో ఏమీ మాట్లాడలేదు. బండి బయలుదేరే వరకూ గుమ్మం దగ్గరే నిలుచొని అలా చూస్తూనే వున్నాడు. అదే చివరి చూపు అవుతుందని చలంగారికి తెలియదు.

ఏం జరిగిందంటే...రాంమూర్తి తన పిల్లల్ని చలంగారి దగ్గరకు పంపించాడు. అతనికి ఇద్దరు ఆడపిల్లలనుకుంటాను. చలంగారి దగ్గర పిల్లలు ఉంటూ వుండగా, రాంమూర్తి, పిల్లలకి ఉత్తరాలు రాస్తుండేవాడు. తండ్రి దగ్గరనుండి ఉత్తరాలు వచ్చినపుడల్లా, పిల్లలు ఏడుస్తూ వుండేవాళ్ళు. వాటితోపాటు చలం గారికి కూడా ఉత్తరాలు రాస్తుండేవాడు. ఆ ఉత్తరాల్లో ఒకసారి "నాపిల్లల్ని నీకు అప్పగిస్తున్నాను. ఇంక నాకు బ్రతకాలని లేదు." అని రాశాడు. ఇలా రాస్తున్నప్పుడు, అసలు ఏం జరుగుతున్నదో, ఏమిటో అర్థం కాలేదు చలం గారికి. అయితే మద్రాస్ లో ఏం జరిగిందంటే...

రత్నమ్మ, ఆ సుబ్రహ్మణ్యం అనే అతన్ని వివాహం చేసేసుకుంది. అంతకు ముందు అంతకు ముందే వివాహం చేసుకుంటారేమోనని వేదన పడుతున్న రాంమూర్తి వివాహం చేసేసుకోవడంతో భరించలేక పోయాడు. దాంతో రాంమూర్తి 'ఇక ఈ లోకంలో ఉండలేను' అని నిర్ణయించుకున్నాడు. ఒక

రోజు ఆ రత్నమ్మా, సుబ్రహ్మణ్యం ఉన్నటువంటి ఇంట్లో, వాళ్ళ సమక్షంలోనే విషం తాగి, ఆత్మహత్య చేసుకున్నాడు. ఇవన్నీ చలంగారికి తరవాత తెలిసాయి. ఆత్మహత్య చేసుకోవడానికి ఒక గంట ముందు చలం గారికి ఒక వుత్తరం రాశాడు. ఆ వుత్తరం యధాతధంగా....

"నాకు ఇది చివరి దెబ్బ. ఆమెకు అంత వ్యధలోనూ నేను అవసరం లేకుండాపోయాను అని. ఆ రాత్రే చచ్చిపోయాను. డబ్బు దొరకబుచ్చుకొని, ఆమె పాదాల దగ్గరకు వెళ్ళి చావడానికే బ్రతికాను ఇన్ని రోజులూ. ఇంకెక్కడ బ్రతకనూ, ఇంకెక్కడ చావను. అంత ఫీలింగూ, సెంటిమెంటూ చచ్చింది నాలో. అందువల్ల ఏమీ వ్రాయలేను చలం. నువ్వు నాదగ్గర వుండాలనిపిస్తోంది. నా జీవితంలో క్షమింప లేనివన్నీ, మృత్యువుతో క్షమించమను. మా....గారినీ, పిల్లలనీ నీకు అప్పజెబుతూ దస్తావేజు రాసి రిజిస్టర్ చేసే బలం వుంటే బాగుండును. కానీ, ఏది చెయ్యడానికీ బలం లేదు నాకు. వాళ్ళు జీవితంలో చాలా దుఃఖాలు పడతారని తెలుసు. నేను బ్రతికి వుంటే, బహుశా వాళ్ళని ఇంకా దుఃఖ పెడతానేమో? నాకే శక్తి వుంటే ముందు వాళ్ళని గొంతు పిసికి ఆఖరు చేసి ఉండాల్సింది. కానీ, నాకు బలం లేకపోయింది. చివరికి గుడ్ బై చెప్పడానికి కూడా. వాళ్ళు నిద్రపోతున్న మంచం వైపు కూడా తిరగలేకపోయాను. వాళ్ళు నన్ను చిన్న గ్రాంఫోన్, సైకిలూ కొనిపెట్టమన్నారు. ఈ దరిద్రపు తండ్రి బీదవాడూ, రుణాల వాడై చచ్చిపోతున్నాడీవాళ. నేనే బ్రతికి వుంటే, ఎవరిదగ్గరనుంచో డబ్బు తన్ని లాక్కొని, అన్నీ వాళ్లకు కొనిపెట్టీ, జైలుకి వెళ్ళి ఉందును. కానీ, బలంలేదు, శక్తి లేదు. దేనికీ చచ్చిపోయినాను. వాళ్లకి శరీరాలు ఎదిగి, వాళ్ళ హృదయాలు పక్వమైనపుడు, ఎంతో ఉపయోగపడదామనుకొన్నాను వాళ్లకి. వాళ్లకి విజ్ఞానాన్ని ఇచ్చి, వాళ్ళకి నిర్భయంగా, ప్రేమించడం బోధించి,వాళ్ళ అధర్మ సంతానానికి ఆశ్రయం ఇవ్వాలని, డార్లింగ్స్ భగ్నమైన నా హృదయాన్నిఎట్లా చీలుస్తున్నారు చలం.!! నాకోసం వాళ్లకి సహాయపడు. వాళ్లకి చేస్తున్న ఈ ద్రోహానికి క్షమించమని చెప్పు. ఈ గుడ్డి లోకం రత్నమ్మనీ, సుబ్రహ్మణ్యాన్ని నిందిస్తుంది. నిందనుండీ, అపవాదు నుండి కాపాడు. నీకు ఏం చెప్పను? నా కృతజ్ఞత.గుడ్ విషెస్, నా ఫేర్ వెల్, సుఖంగా ఉండమని కోర్కె.ప్రేమ. కానీ, నువ్వు చేస్తున్న మంచిపని, స్త్రీ, పురుషులకు రక్తమూ, మాంసమూ, హృదయమూ ఉన్నన్నాళ్ళూ నీ పుస్తకాలు జీవిస్తాయి. తరవాత కూడా. బాధలు పడే, స్ట్రగుల్ పడే స్త్రీ లందరి కోసం కన్నీటితో చచ్చిపోతున్నాను. ఎప్పటి మల్లేనే సహాయం చేస్తూవుండు. జీవితంలో నాకు పని వున్నట్లు తోచడం లేదు. కొరగాని ముసలి తొక్కుకింద పెరగడం నాకు ఇష్టం లేదు. నువ్వు ఆర్టిస్టువి. జీవితం కన్నా ఎక్కువ కాలం బ్రతకాలి నువ్వు. నా కింక నడవాలని లేదు.ఈ అంధకారంలో ప్రయాణానికి అర్ధం లేదు. నాకేదో త్రోవ కనబడుతోంది. ఆర్ట్, స్టోరీస్,చిల్డ్రన్, వుమెన్ ఈ గోతులలో నాకేమీ కనపడవు. నీకు కనబడే

ఆ సన్నని వెలుగు నాకు కనబడదు. అంధకారంలోకి వెళ్ళిపోతున్నాను. చచ్చిన నా శరీరాన్ని, చచ్చిపోయిన ఎలుక లాగా కిటికీ లోనుండి పారేసెయ్యమని చెప్పు"

ఇంత దీనంగా హృదయ విదారకంగా, చనిపోవడానికి ఒక గంట ముందు చలం గారికి వుత్తరం రాసి, ఆ రత్నమ్మా, సుబ్రహ్మణ్యం సమక్షంలో ఆత్మహత్య చేసుకున్నాడు రాంమూర్తి. అప్పటికి దాదాపు పది సంవత్సరాలుగా పరిచయం. చలంగారికీ, రాంమూర్తికీ యెంత గాఢమైన స్నేహం అంటే, రాం మూర్తి అంటుండేవాడట "చలం నాకు డబ్బులు వుంటే నీ పుస్తకాలన్నీ అచ్చు వేయించీ, వీధి వీధిలో మూల మూలలా పంచిపెడతాను. బహుశా స్త్రీని అయితే, నీ హృదయ తృప్తికే నా శరీరాన్ని అర్పించేవాడిని"అని. రాంమూర్తి, చలం గారికే కాకుండా, క్రిష్ణ శాస్త్రిగారికి కూడా ఇష్టమైన మిత్రుడు.

తెలుగు సాహిత్యంలో ముగ్గురు సాహితీ ప్రముఖులతో, పుస్తకాలను అంకితం చేయించుకున్న ప్రత్యేకత ఈ రాం మూర్తి కి దక్కింది.1. చలం గారు రాసిన మొట్టమొదటి నవల 'శశిరేఖ', 2. దేవులపల్లి 'ప్రవాసం' అనే కావ్యం, 3. ముద్దుక్రిష్ణ గారు ప్రముఖుల కవితలన్నీ సేకరించి ప్రచురించిన "వైతాళికులు"అనే పుస్తకం. చలం గారి "మ్యూజింగ్స్"లో చాలా చోట్ల ఈ రాం మూర్తి ప్రస్తావన వుంటుంది. ఇతను ఇంత దయనీయంగా ఎందుకు చనిపోయాడు? అనే విషయాన్ని చలం గారు చాలాసార్లు గుర్తు చేసుకున్నారు. ఎలా అంటే " బతికితే తనకోసం ఎక్కువయి, ఏ నీతిమంతుల, ఏ భర్తల, ఏ భాగ్యవంతుల, అధికారుల తలలు బద్దలు కొట్టాల్సి వస్తుందోనని, దూరంగా వెళ్ళాడు మీకోసం" అని పాఠకులనుద్దేశించి రాశారు. ఇంకా ఏమన్నారంటే.."కొన్నేళ్ళు, పిల్లల్ని బాధించే తండ్రులకూ, భార్యల్ని పాలించే భర్తలకూ, చుట్టుపక్కల నీతి అధికారులకూ, సింహ స్వప్నమైనాడు.అనాధలకూ, సంఘం ఉమ్మి పులుముకున్న దీనులకూ, మతి చెడ్డ మిత్రులకూ,అందరికీ తలుపులు తెరిచి ఉంచాడు. హృదయాన్ని పంచాడు. ప్రేమకోసం లోకాన్ని వెతికాడు. మై సెన్ డిజైర్ టు బి లౌడ్ అన్నాడు. అంత కన్నా ఘోరమైన పాపం ఎరగదు.ఈ లోకం"అని. ఇంకా రాం మూర్తి మీద ఒక మోనోలాగ్ లాంటిది రాశారు.యేమని అంటే, "రాం మూర్తి నాకు ఒకటే బెంగ. మనం దేవుడు మీద నీతి మీదా, అధికారుల మీదా, తిరగబడ్డ వాళ్ళం. యెంత అసహ్యంగా వున్నా, "భూమినీ, సంఘాన్నీ వదలి ఎగురు దామంటే వినాశనం తప్పదు." అని నమ్మి హేళనగా చూసే ప్రజలు "చూడండి రాం మూర్తి అన్నిటినీ ధిక్కరించి ఏమైనాడు"అనడానికి వీలునిచ్చావు.మన స్వేచ్చని భరించ లేనివాళ్ళు, మన పేరు విని గొణిగే సంఘాధికారులూ,వీళ్ళ చేతుల్లో అపజయం పొందావనీ, నీవంక చూపుతున్నా రందరూ, దిక్కుమాలిన స్త్రీలని ఇనప ముక్కలతో పొడిచి

చంపడానికి, జంకిన రాబందులన్నీ, నీ శవం చుట్టూ చుట్టూ పోగై ఉత్సవాలు చేసుకుంటున్నాయి. రాం మూర్తి తిరగబడ్డ యువకుల్నీ, అధికారుల్ని ఎదిరించే వీరుల్నీ, సంఘానికి బలైన నిర్భాగ్యుల్నీ, అందర్నీ హేళనగా నవ్వి, నీవంక చూపుతున్నారు. క్రూరుడైన రాజు 'వేళ్ళాడే అస్తిపంజరాల్ని జాగ్రత్త!' అని చూపుతున్నట్లు.సంఘ కాళీ,తెల్లబడ్డ నీ ఎముకల్ని చూపుతోంది. నీ మరణం అపజయం కాదనీ, సంఘం మీదనే కాదు, మనిషి స్వభావం మీదా, మరణం మీదా జయధ్వానమని తెలపడానికే మిగిలాను నేను"అని అంత తీవ్రంగా రాంమూర్తి గురించి, చలం గారు దాదాపు జీవితాంతం బాధపడుతూనే వున్నారు.

ఈ రాం మూర్తి గురించి, మరో మిత్రుడు దేవులపల్లి క్రిష్ణ శాస్త్రి గారు ఏమన్నారో చూద్దాం...ఆయన ఇలా రాశారు " ఓ మానవోత్తమా...ఓ వీర మూర్ధన్యా! నీ అమృత భా సమోన్నత ప్రేమ సామ్రాజ్య చక్రవర్తీ! స్నేహశీలీ!నీ హృదంతరములో నిరుమాన ఘూత, రత్నాకర మూల్య రాగ సంపద మెరయు, ఈ అశ్రుఝరులతో, ఇరులతో, రొదలతో, సొదలతో, ఈ హాస మృదుల వాసనలతో విశముతో, సిగ్గుతో, కొసరు తేవీలతో,ఈపాటి బ్రతుకు నీ పాటి దోయి నా నెచ్చెలీ, నెచ్చెలీ" అని రాశారు.

రాంమూర్తి ఆత్మహత్య జరిగిన రోజుల్లోనే, కొద్దీ ముందు వెనకల్లో చలం గారు "మైదానం"నవల రాశారు. ఇప్పుడొకసారిమైదానం నవలను గుర్తు చేసుకొని రాం మూర్తీ, రత్నమ్మా, చలం లను చూస్తే ఆ పోలికలు తెలుస్తాయి. అదలా వుంటే, రాం మూర్తి చనిపోయాక రత్నమ్మ ఏమైంది అది కూడా తెలియాలి. అయితే, రత్నమ్మా, సుబ్రహ్మణ్యం పెళ్ళిచేసుకున్నారు. రాం మూర్తి చనిపోయాక పోలీసులు వచ్చి, వాళ్ళిద్దరినీ అరెస్ట్ చేశారు. ఎందుకంటే, వాళ్ళ ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నాడు కదా! అయితే, అప్పుడే ఈ రాం మూర్తి రాసినటువంటి వుత్తరం దొరికాక, "వీళ్ళిద్దరికీ అతని ఆత్మహత్య తో సంబంధం లేదు. ఆయనే, స్వయంగా ఎవరి ప్రోద్బలం లేకుండా ఆత్మహత్య చేసుకున్నాడు" అని కోర్టు తీర్పు ఇచ్చాక వాళ్ళిద్దరినీ వదిలేశారు.

అయితే, ఈ రత్నమ్మ ఏమైందంటే...ఆ తరువాత కొద్దిరోజులకే సూళ్ళూరు పేటలో రైలు ప్రమాదంలో మరణించింది.ఆ విధంగా రాం మూర్తి అలా అయ్యాడు. రత్నమ్మ ప్రమాదవశాత్తూ మరణించింది. చలంగారు జీవితాన్ని కొనసాగిస్తున్నారు. అయితే, రత్నమ్మని వివాహం చేసుకొన్న సుబ్రహ్మణ్యం ఏమయ్యారో తెలియలేదు.

అ తరువాత చలంగారి పెద్ద కుమారుడు రవి మరణించాడు. అదెలా జరిగిందంటే...చలం గారికి రవి అంటే విపరీతమైన ప్రేమ. కారణం, ఆ రవి మద్రాస్ లో పుట్టినపుడు, భార్య రంగనాయకమ్మ గారు స్కూలుకి వెళుతుండేవారు. అందుకని రవిని నెలల పిల్లవాడుగా వున్నప్పటి

నుండి చలం గారి దగ్గరే చేరిక. ఆ తరువాత 6 సంవత్సరాలకు సౌరీస్ పుట్టింది. అంతవరకూ రవి ఒక్కడే. చిన్నప్పటినుండే అన్నీ బోధిస్తుండేవారు. తాను చదువుతున్న పుస్తకాలగురించి చెప్పడం, ఇంగ్లీష్ పుస్తకాల గురించి చెప్పడం చేసేవారు. ఆ తరువాత రవి పెరిగాక, తనే ఇంగ్లీష్ పుస్తకాలు చదివి, తండ్రిని అర్థాలు అడగడం చేస్తుండేవాడు. విపరీతమైన తెలివి తేటలు గలవాడు. అందువల్ల చలం గారికి తన భావాలు పంచుకోవడానికి బాగుండేది. ఆ తరువాత మరో ఇద్దరు పుట్టినప్పటికీ రవితోనే ఎక్కువ చనువుగా వుండేవారు.

అలాగే ఆ రవికి కూడా అన్నిటిమీదా ఆసక్తి వుండేది. కొత్త వస్తువులు కెమెరా, సైకిలూ లాంటివి కొనమని అడుగుతుండేవాడు. చలంగారు ఎన్ని ఇబ్బందులు వున్నా రవి అడిగినవన్నీ కొనిపెడుతుండేవారు. రవికి పది సంవత్సరాలు వచ్చేవరకూ ఆరోగ్యం బాగానేవుంది. ఆ తరువాత తెలిసింది– రవి చిన్న తనం నుండే గుండెకు సంబంధించిన వ్యాధితో బాధ పడుతున్నాడని.

బందరులో చలంగారు వుద్యోగం చేసేటప్పుడు అది బయట పడింది. ఒక డాక్టరు గారి ఇంట్లో అద్దెకు ఉండేవారని అనుకున్నాం కదా! అతనికి చూపించినపుడు ఆయన చెప్పీ, చెప్పకుండా చెప్పారట ”ఈ కుర్రవాడు మరో ఆరు సంవత్సరాల కంటే బ్రతకడు”అని. ఆ విషయం తెలిసినపుడు చలం గారికి విపరీతమైన మానసిన బాధ. ఎప్పుడో ఒకసారి వెళ్లిపోతాడని. తండ్రి బాధపడుతున్నాడని ఆ రవి కూడా బాధ పడుతుండేవాడట. “నాన్నా! నా గురించి నేను బాధ పడడం లేదు. కానీ, నాకేమైనా అయితే, నువ్వెంత బాధ పడతావోనని ఆలోచిస్తుంటే...నాకు బాధకలుగుతోంది.” అని.

వదిన రంగనాయకమ్మగారు హైదరాబాద్ లో ట్రైనింగు తీసుకునేటప్పుడు, రవిని అక్కడకు కూడా తీసుకువెళ్ళారు. వాళ్ళు కూడా చలం గారికి రవికి అర్థంకాకూడదని ఇంగ్లీషులో చెప్పారట. “ఐ కెనాట్ మేక్ యే సపరేట్ హార్ట్ ఫర్ యువర్ సన్”అని. కానీ, ఆ కొడుక్కి తెలుసు ఆ ఇంగ్లీషు. ఇద్దరికీ తెలిసిపోయింది – ఎక్కువకాలం బ్రతకడని. ఆ నిస్సహాయ పరిస్థితిలో చలంగారు ఆయనకు లేని మూఢనమ్మకాలను కూడా నమ్మడం ప్రారంభించారు. ఎవరు ఏది చెబితే అది చేస్తుండేవారు. ఆ ప్రయత్నాలు ఎలాంటివి? కొడుకు చనిపోయిన తరువాత మూడు రోజులపాటు శవాన్ని ఉంచినా చలంగారు ఎందుకు వెళ్లలేకపోయారు? అవన్నీ జరుతున్న రోజుల్లోనే చలంగారు ఎంత అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించారు...? ఈ విశేషాలన్నీ వచ్చేభాగంలో..

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 మార్చి 5 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు